క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మౌలాను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి, నాయకులు

దొరవారిసత్రం : మండలంలోని వేణుంబాకం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ మౌలా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య బుధవారం వేణుంబాకం వెళ్లి ఆయనను పరామర్శించారు. మండల కన్వీనర్ అల్లూరు రాహుల్‌రెడ్డి, నాయకులు మునస్వామినాయుడు, పద్మనాభరెడ్డి, రాజగోపాల్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు దారి చూపాలని వినతి

కలువాయి(సైదాపురం): మండలంలోని రామన్నగారిపల్లెలో సర్వే నంబర్ 300, 303, 304, 310 నంబర్లలోని పొలాలకు దారి లేకుండా పోయిందని రైతులు దండు యానాదయ్య, మాతంగి చిన్నయ్య, పెంచల నరసయ్య వాపోయారు. వారు బుధవారం తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జిమ్మి చింతా వాగు గట్టు మీద దారి ఉండేదని, ఇప్పుడు చెక్ డ్యాం నిర్మించడంతో దారి లేకుండా పోతుందని తెలిపారు. తద్వారా సుమారు 15 ఎకరాల భూమి బీడు భూమిగా మారుతుందన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

కలువాయి(సైదాపురం): మండల కేంద్రమైన కలువాయిలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం నుంచి ఈడబ్ల్యూఎస్ సహకారంతో మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నట్టు ట్రెనింగ్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లునాయుడు తెలిపారు. 90 రోజులు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. 80 శాతం హాజరు ఉన్న వారికి ఉచితంగా కుట్టు మెషిన్లు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనర్ అరుణ, ఆపరేటర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పైపులైన్‌కు మరమ్మతులు

చిల్లకూరు : గూడూరు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే కండలేరు పైపులైన్ మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్టు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన బుధవారం మరమ్మతు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కండలేరు డ్యామ్ నుంచి గూడూరు సమీపంలోని వేములపాళెం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వరకు ఉన్న పైపులైన్ మూడుచోట్ల పగిలిపోయి నీరు వృథాగా పోతోందన్నారు. వాటికి మరమ్మతులు చేస్తున్నట్టు తెలిపారు. గురువారం పట్టణ వాసులకు తాగునీరు అందదని, శుక్రవారం సరఫరా చేస్తామన్నారు.

కలువాయి పీహెచ్‌సీ తనిఖీ

కలువాయి(సైదాపురం) : కలువాయి పీహెచ్‌సీని బుధవారం అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌వో, లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి ఖాదర్ వలి బుధవారం తనిఖీ చేశారు. టీబీముక్త అభియాన్ కార్యక్రమంపై వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే వారం కంటే ఎక్కువ రోజులు దగ్గు ఉంటే వైద్యులను సంప్రదించి గళ్ల పరీక్ష చేసుకునేలా చూడాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలంచారు. కార్యక్రమంలో వైద్యులు విజయలక్ష్మి పాల్గొన్నారు.

రాపూరులో అగ్ని ప్రమాదం

రాపూరు: రాపూరులోని అగర్తకట్ట వద్ద ఉన్న ముళ్ల పొదల్లో బుధవారం నిప్పు అంటుకుని మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. చెట్లు మాత్రమే కాలిపోయినట్టు అధికారులు తెలిపారు.

కండలేరు ఈఈగా గజేంద్రరెడ్డి



రాపూరు: మండలంలోని కండలేరు జలాశయం ఈఈగా గజేంద్రరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నాయుడుపేటలో డీఈగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఈఈగా పనిచేస్తున్న రామచంద్రమూర్తి యథాస్థానానికి వెళ్లారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కండలేరులో బుధవారం నాటికి 36.222 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,240, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న వైద్యబృందం

రాపూరు : మండలంలోని సంక్రాంతిపల్లి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గతంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో బుధవారం జిల్లా వైద్యాధికారులు గ్రామాలకు వెళ్లి పరీక్షలు చేసుకున్న వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వేపినాపి పీహెచ్‌సీ వైద్యులు ప్రమీలారాజకుమారి, సూర్యధర్మేంద్ర మాట్లాడుతూ గతంలో పింక్ బస్సుల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకున్న వారితో జిల్లా అధికారులు మాట్లాడుతున్నట్టు తెలిపారు. రోజుకు 30 ఇళ్ల చొప్పున నాలుగు రోజులు 120 ఇళ్లలో పరిశీలన చేస్తారని పేర్కొన్నారు.

పెళ్లకూరు : పాఠశాల విలీనం మానుకోవాలని నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లులు



డీవీ సత్రంలో ఎంఈవోకు వినతి పత్రమిస్తున్న అయ్యపాళెం, టపాయిండ్లు, వీఎస్ఆర్ నగర్ వాసులు



స్కూళ్ల విలీనంపై ఆందోళన

పెళ్లకూరు మండలం నెలబల్లి, తడ మండలం తడ ఎస్సీ కాలనీ, దొరవారిసత్రం మండలం అయ్యపాళెం, టపాయిండ్లు, మొదుగులపాళెం, ఉచ్చూరు తదితర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయరాదని పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. వారు బుధవారం పాఠశాలల వద్ద నిరసన తెలిపారు. కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలకు పిల్లలను ఎలా పంపించాలని నిలదీశారు. ఇలా అయితే తమ పిల్లలను చదువు మానిపించి ఇళ్ల వద్దే పెట్టుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ఎంఈవోలకు వినతి పత్రాలు అందజేశారు.



తడ ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

పెళ్లకూరు/తడ/దొరవారిసత్రం : పెళ్లకూరు మండలం నెలబల్లి పాఠశాలను 75 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎక్కువ మంది దళితులు, నిరుపేద పిల్లలు చదువుకుంటున్నారు. ఇక్కడ ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. అదే గ్రామంలో 50 ఏళ్ల క్రితం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు జెడ్పీ హైస్కూల్లో చేరి ఉన్నత విద్యను పూర్తి చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను రద్దు చేసి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమవరం పాఠశాలలో విలీనం చేశారు. నెలబల్లి నుంచి భీమవరం చేరుకోవడానికి రోడ్డు సౌకర్యం లేదు. పిల్లలు కాలి బాటన నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి ఉంటుంది. తడ మండలంలోని తడ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 42 మంది చదువుతున్నారు. వారిలో 27 మందిని తడకండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేశారు. తడ హరిజనవాడ నుంచి తడకండ్రిగ పాఠశాలకు కిలో మీటరు దూరం ఉంది. ఈ దారిలో మందుబాబులు, పేకాట రాయుళ్లు, గంజాయి సేవించేవారు ఎక్కువగా సంచరిస్తుంటారు. పిల్లలు నడిచి వెళ్లే సమయంలో ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు ప్రశ్నించారు. అదే విధంగా అక్కంపేట తూర్పు హరిజనవాడలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 27 మంది విద్యార్థుల్లో 21 మందిని జాతీయ రహదారికి పడమర వైపు ఉన్న పాఠశాలలోకి విలీనం చేశారు. వీరు జాతీయ రహదారిని దాటాల్సి ఉంటుంది. పిల్లలు రోడ్డు దాటే సమయంలో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు ప్రశ్నించారు. తమ గ్రామాల్లోని పాఠశాలలను యదావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. దొరవారిసత్రం మండలంలోని అయ్యపాళెం, టపాయిండ్లు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను సుమారు నాలుగు కిలోమీటర్లు దూరంలో ఉన్న తల్లంపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కలిపారు. ఉచ్చూరు గ్రామంలోని ప్రాథమి పాఠశాలను ఎత్తివేసి సూళ్లూరుపేట మండలం మంగళంపాడు ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు పిల్లలను ఎలా పంపించాలని నిలదీశారు. చిన్న పిల్లలు కాలినడకన అంతదూరం నడిచి వెళ్లి ఎలా చదువుకుంటానని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలను యధావిధిగా కొనసాగించాలని కోరారు. అనంతరం ఎంఈవోలకు వినతి పత్రాలు అందజేశారు.

చిన్నబిడ్డలను పాఠశాలకు పంపించలేము



నెలబల్లి నుంచి భీమవరం పాఠశాలకు నాలుగు కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. చిన్న బిడ్డలను చెరువుకట్ట కింద ఉన్న శ్మశానం మీదుగా కాలిబాటన పంపించలేము. పాఠశాలను విలీనం చేయడం వల్ల పిల్లలందరూ బడి మానేయాల్సిన దుస్థితి. - సుధా, నెలబల్లి, పెళ్లకూరు

పాఠశాల విలీనాన్ని రద్దు చేయాలి



నెలబల్లిలో దశాబ్దాలుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలను భీమవరంలో విలీనం చేయడం అన్యాయం. గ్రామంలో ఉన్న జెడ్పీ హైస్కూల్‌కు అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలి. అంతేగాని నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు పంపించేది లేదు.
- వెంకటేష్, నెలబల్లి, పెళ్లకూరు

రహదారి వెంబడి పిల్లలను పంపించలేము



టపాయిండ్లు పాఠశాలను ఎత్తివేసి తల్లంపాడులోని ప్రాథమిక పాఠశాలలో కలిపారు. పిల్లలు కాలినడకన జాతీయ రహదారి వెంబడి నాలుగు కిలోమీటర్లు దూరంలో ఉన్న తల్లంపాడు పాఠశాలకు ఎలా పంపించాలి. పిల్లలు రోజూ నడిచి వెళ్లాలంటే ఎలా..?
- కోట్లపాటి సుధా, వీఎస్ఆర్ నగర్, దొరవారిసత్రం మండలం

ప్రమాదాల అంచున విద్యార్థుల చదువులు కష్టమే



అయ్యపాళెం నుంచి తల్లంపాడు పాఠశాలకు వెళ్లాలంటే మధ్యంలో వున్న రైలు పట్టాలు, నెర్రికాలువ, జాతీయ రహదారిని దాటి నాలుగు కిలోమీటర్లు కాలినకన వెళ్లాలి. ఇన్ని కష్టాలు పడి మా బిడ్డలు పాఠశాలలకు వెళ్లాల్సిన అవసరమే లేదు.
- పి.సామయ్య, అయ్యపాళెం, దొరవారిసత్రం

పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం



జయరామయ్యను సన్మానిస్తున్న సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : వైఎస్సార్ సీపీ కోసం పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య తెలిపారు. వైఎస్సార్ సీపీ కల్చరల్ వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కటకం జయరామయ్యను ఘనంగా సత్కరించారు. సంజీవయ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న జయరామయ్యకు రాష్ట్ర స్థాయి పదవి లభించడం అభినందనీయమన్నారు. ఆయనను ముస్లిం మైనారిటీ నియోజకవర్గ కన్వీనర్ షేక్ షబ్బీర్, పట్టణ అధ్యక్షుడు షేక్ రహంతుల్లా, పేట చంద్రారెడ్డి, కావేరిపాకం అశోక్‌కుమార్, మారంరెడ్డి ముత్యాలురెడ్డి, మెస్ భాస్కర్ రెడ్డి, పేర్నాటి రాహుల్, మీజూరు బాల తదితరులు అభినందించారు.

పేద విద్యార్థుల విద్యకు సహాయం



విద్యార్థులతో డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సురేంద్రరెడ్డి

చిల్లకూరు : పేద పిల్లల చదువుకు సహాయ సహకారాలు అందిస్తున్నట్టు డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం గూడూరులోని సంస్థ కార్యాలయంలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వున్న పేద పిల్లల్లో ప్రతిభ వున్నా ఆర్థిక స్థోమత లేక చదువుకోలేకపోతున్నారని తెలిపారు. వారిని ఎంపిక చేసి 2 నుంచి 10వ తరగతి వరకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. 2008లో ఫౌండేషన్ ఏర్పాటు చేశామని, నాటి నుంచి నేటి వరకు 136 మంది విద్యార్థులకు సహాయ సహకారాలు అందించినట్టు వివరించారు.

'అర్హులందరికీ తల్లికి వందనం వర్తింపజేయాలి'



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చిల్లకూరు : గూడూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగంలోని కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు బీవీ రమణయ్య, జోగి శివకుమార్, అడపాల ప్రసాద్, కోరారు. వారు బుధవారం గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొంతమందికి పథకం వర్తింపజేయకపోవడం తగదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం బైక్ ర్యాలీ, 23న కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంబేటి చంద్రయ్య, మురళీ, మణి, మణెమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలెక్కడ సారూ..?

సూళ్లూరుపేట : సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తానని ప్రజలను నమ్మించి ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా హామీల అమలులో చంద్రబాబు మీనమేషాలు లెక్కిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.హరినాథ్‌రెడ్డి విమర్శించారు. సూళ్లూరుపేటలో సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ నాయకులు సిహెచ్ సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన తిరుపతి జిల్లా రెండో మహాసభల విజయవంతంపై ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన సీపీఐ నాయకులకు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల్లో నాలుగు లక్షల ఉద్యోగాల భర్తీ, లేకుంటే నిరుద్యోగ భృతి ఊసే లేకుండా పోయిందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉగాది నుంచే కల్పిస్తానని చెప్పి మోసం చేశారని అన్నారు. ఆడబిడ్డ నిధికింద మాయమైందని దుయ్యబట్టారు. అన్ని పథకాలు ఇచ్చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందనానరు.

కోటపోలూరు పూర్వ విద్యార్థుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సూళ్లూరుపేట : మండలంలోని కోటపోలూరు జెడ్పీ హైస్కూల్‌లో 1989–90లో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం సమావేశమయ్యారు. ఎక్కడెక్కడో వున్న వారంతా ఒక చోట చేరి సందడి చేశారు. చిన్నతనంలో తాము చేసిన అల్లరిని గుర్తుచేసుకున్నారు. స్నేహితులతో సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.

'అక్రమ కేసులకు భయపడం'



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ భయపట్టేందుకు ప్రయత్నిస్తోందని, దీన్ని ప్రశ్నించే మీడియా గొంతు నొక్కేస్తోందని వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆరోపించారు. ఆయన బుధవారం గూడూరులోని సనత్‌నగర్‌లోవున్న తన నివాసంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ సంస్థాగత విషయాలపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలోని రెంటపాళ్ల గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెళుతుంటే ఆంక్షలు విధించడం దారుణమని తెలిపారు. పెద్ద సంఖ్యలో వచ్చిన అభిమానులను అడ్డుకునేందుకు బారికేడ్లు పెట్టడం దుర్మార్గమన్నారు. అలాగే చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి నోటీసు కూడా ఇవ్వకుండా అరెస్టు చేశారని విమర్శించారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని తెలిపారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం అక్రమ కేసులకు స్వస్తి పలికి ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టాలని కోరారు.

కూటమి ఏడాది పాలన అంతా అరాచకమే



జగన్ అంటే నమ్మకం-బాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

చిట్టమూరు : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా అరాచకమేనని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తగుంటలో వున్న వైఎస్సార్ విగ్రహం వద్ద బుధవారం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై వైఎస్సార్ సీపీ ముద్రించిన జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలతోపాటు 149 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. తల్లికి వందనం పేరుతో రూ.15 వేలకు బదులు రూ.13 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు. అనేక మందికి నగదు జమ కాలేదని తెలిపారు. కార్యక్రమంలో కామిరెడ్డి కస్తూర్ రెడ్డి, పేట రాజీవ్‌రామిరెడ్డి, దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, మాచిరెడ్డి సుధీర్ రెడ్డి, లోకేష్ రెడ్డి, చెన్నారెడ్డి బాబురెడ్డి, కామిరెడ్డి రమేష్ రెడ్డి, కోదండరామిరెడ్డి, దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, అనీల్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, రాజేష్ రెడ్డి, వైసీ పుట్ట బాబు, వంకా చెంచయ్య, బట్టా చెంగయ్య, తేరువాయి మణెయ్య, సురేష్, నరేష్, దీనబంధు, కస్తూరయ్య, మనోహర్, ఎల్లూరు గ్రామ యూత్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల నివారణపై అవగాహన



నాయుడుపేట టౌన్ : పొలంబడిలో ఏడీఏ నాగార్జునసాగర్, ఏవో గణేష్

నాయుడుపేట టౌన్ : వరి పంటను ఆశించిన తెగుళ్లను సరైన సమయంలో నివారిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ నాయుడుపేట డివిజన్ ఏడీఏ నాగార్జున సాగర్ తెలిపారు. అన్నమేడు, పుదూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిని ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు చర్యలను వివరించారు. జింకు సల్ఫేట్, యూరియా తగిన మోతాదులోనే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఏవో గణేష్, వీఏఏలు చెంగలరాజు, వెటర్నరీ అసిస్టెంట్ మాధవి పాల్గొన్నారు.

వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

సైదాపురం: రైతులు వరిలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో హైమావతి తెలిపారు. మండలంలోని తురిమెర్ల, గిద్దలూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వినియోగిస్తే పంటలను చీడపీడలు ఆశించవని తెలిపారు. అన్నదాత సుఖీభవకు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

డిజైన్ టెక్నాలజీపై విద్యార్థులకు శిక్షణ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు బెంగళూరుకు చెందిన డైనమిక్ జనరిక్ సొల్యూషన్స్ సంస్థ డిజైన్ టెక్నాలజీపై బుధవారం శిక్షణ ప్రారంభించింది. సంస్థ ప్రతినిధి నాగార్జున్ మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు పలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. పారిశ్రామిక రంగం కోరుకున్న విధంగా విద్యార్థులు నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆరు వారాల పాటు శిక్షణ ఇస్తామన్నారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ అశోక్‌కుమార్ రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్ పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని తూతూమంత్రంగా నిర్వహించారు. సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరుకాలేదు. వచ్చిన కొంతమంది అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులతోనే సమావేశాన్ని మొక్కుబడిగా నిర్వహించి ముగించారు.

సైదాపురం ఏపీఎంగా రాధ

సైదాపురం: సైదాపురం ఏపీఎంగా రాధ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె రాపూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఏపీఎం చంద్రశేఖర్ రాపూరుకు బదిలీ అయ్యారు. అలాగే రికవరీ ఏపీఎంగా పనిచేస్తున్న శైలజను రెగ్యులర్ ఏపీఎంగా వెంకటగిరికి బదిలీ చేశారు. వారిని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ అభినందించారు.

ఉద్యమంలా మొక్కల పెంపకం

చిల్లకూరు : మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. వారు బుధవారం పారిచెర్లవారిపాళెంలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమని వివరిస్తూ ప్రధాని మోదీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నారని తెలిపారు. యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పారిచెర్ల భైరప్ప, అన్నంరెడ్డి కిరణ్‌రెడ్డి, సాయికుమార్, బాషా పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులను వేగవంతం

సైదాపురం: ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆదేశించారు. ఆయన బుధవారం మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు పూర్తి చేసిన లబ్ధిదారుల ఖాతా ల్లోకి నిధులు జమ చేస్తామని తెలిపారు. మిగిలిన వారు కూడా పనులు చేపట్టేలా అవగాహన కల్పించి జూన్ నెలాఖరు లోపు పనులు పూర్తి చేయించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

నాయుడుపేట టౌన్ : సూళ్లూరుపేట నియోజవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె బుధవారం గుడ్ మార్నింగ్ నాయుడుపేట కార్యక్రమం నిర్వహించారు. మాలాయకోట (ఎంఆర్ నగర్)లోని పాఠశాల వద్ద నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లు అందజేశారు. మాలయకోటలో పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైస్ చైర్మన్ షేక్ రఫీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, కమిషనర్ షేక్ ఫజులుల్లా, తహసీల్దార్ రాజేంద్ర, మున్సిపల్ ఏఈ చంద్ర, విద్యుత్ ఏఈ శివశంకర్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏజీపీ గ్యాస్ పైపులైన్ సమీపంలో తవ్వకాలపై నిషేధం

ఓజిలి: ఓజిలి జాతీయ రహదారి కూడలి సమీపంలోని ఏజీపీ గ్యాస్ పరిశ్రమ నుంచి అత్తివరం, నాయుడుపేట, మేనకూరు ఇండస్ట్రియల్ ప్రాంతం, గూడూరు పరిసర ప్రాంతాల్లో రోడ్డు పక్కన పైపులైన్‌పై తవ్వకాలను నిషేధించినట్టు పరిశ్రమ యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజలు అవగాహన లేకుండా గ్యాస్ పైపులైన్‌పై తవ్వకాలు చేపడితే గ్యాస్ లీకై ఆస్తి, ప్రాణనష్టం జరుగుతుందని పేర్కొంది. సమాచారం లేకుండా తవ్వకాలు జరిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నాయుడుపేట మున్సిపాలిటీ సిబ్బంది తాగునీటి పైపులైన్ల కోసం తవ్వకాలు జరిపే ముందు తమకు సమాచారం ఇవ్వాలని సూచించింది. పరిశ్రమ టోల్‌ఫ్రీ నంబర్లకు 18002022999, 72000108123 సమాచారం అందించి సహకరించాలని కోరింది.

వికసిత్ భారత్ సంకల్ప సభపై సమీక్ష

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప సభపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చాంద్ ఖాశీం, పార్టీ అధ్యక్షురాలు సరస్వతి, బీజేవైఎం నేత సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.